తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ళ ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026

# సిరులు కురిపించు పద్మావతీ అమ్మ

**-తిరుచానూరులో వేదోక్తంగా వరలక్ష్మివ్రతం**



తిరుచానూరు/తిరుపతి,ఆగస్టు 21 ప్రభాతవార్త: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వరలక్ష్మీపర్వదినాన పద్మావతి అమ్మ బంగారు చీరతో విశేషంగా అలంకరించుకుని భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. అనంతరం ఉత్సవమూర్తికి వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రోజా, మల్లె, చామంతి, సంపంగి, తామర, తులసి తదితర సుగంధ, సంప్రదాయ పుష్పాలతో అమ్మవారిని వేదపఠనంతో అర్చించారు. తొమ్మిది గ్రంథులతో అమ్మవారిని అలంకరించి, ఒక్కో గ్రంథిని ఒక్కో దేవతకు ప్రతీకగా పూజించారు. అనంతరం 12 రకాల నైవేద్యాలను సమర్పించి మహా మంగళహారతితో వ్రతాన్ని ముగించారు. అమ్మవారి సన్నిధిలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం అత్యంత విశిష్టమైనదని పేర్కొన్నారు. వరలక్ష్మీ వ్రతానికి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పద్మావతి అమ్మవారు స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు, జెఈఓ డాక్టర్ ఎ.శరత్ దంపతులుపాల్గొన్నారు. టిటిడి బోర్డు సభ్యులు జి భానుప్రకాశ్ రెడ్డి దంపతులు, ఎన్. సదాశివరావు, సురేష్ కుమార్, జానకి దేవి, రంగశ్రీ, సివిఎస్ఓ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈఓ పి.హరీంద్రనాథ్, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# డిప్యూటీ తహశీల్దార్ సస్పెండ్!

తొట్టంబేడు, ఆగస్టు 21 ప్రభాతవార్త: తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న డిప్యూటీ తహశీల్దార్ జీవన్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తొట్టంబేడు రెవెన్యూ కార్యాలయంలో సాగుతున్న అవినీతి, అక్రమాలపై ఉన్నతాధికారులు దృష్టిసారించారని చెప్పవచ్చు. మండలంలో విచ్చలవిడిగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటూ అమ్ముకుంటుంటే రెవెన్యూ శాఖ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు సిఎం కార్యాలయంకు చేరాయి. శుక్రవారం సస్పెండ్ అయిన డిప్యూటీ తహశీల్దార్ జీవన్‌కుమార్ గతంలో తిరుపతి సమీపంలోని శెట్టిపల్లికి చెందిన 0.09 సెంట్ల భూవివాదంలో రూ. 3లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు అందినట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌పై నిరాధార, అసత్య ఆరోపణలు చేసిన ఓ ఆడియో రికార్డింగ్ సోషల్ మీడియా లోహల్‌చల్ చేసింది. ఈ మీడియాపై శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజినల్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. వారి విచారణలో భాగంగా ఆడియో రికార్డింగ్ పరిశీలించి అందులో వాయిస్ తొట్టంబేడు డిప్యూటీ తహశీల్దార్ జీవన్‌కుమార్‌గా నిర్ధారణకు వచ్చారు. శ్రీకాళహస్తి అధికారులు సమర్పించిన నివేదికల ఆధారంగా జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ రూల్సు క్రింద జీవన్‌కుమార్‌పై మూడు అభియోగాలను నమోదు చేసి శాఖాపరమైన చర్యలకు ఆదేశించారు.

**తొట్టంబేడు రెవెన్యూ కార్యాలయంలో విచ్చలవిడి..**

శ్రీకాళహస్తి నియోజకకవర్గంలోని తొట్టంబేడు ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఆరోపణలు విచ్చలవిడిగా మారాయి. మండలంలోని చెరువులు, ప్రభుత్వ స్థలాలను అప్పనంగా ఆక్రమించుకుంటూ అమ్ముకుంటున్నా రెవెన్యూ శాఖలో స్పందన లేదు. అలాగే తప్పుడు రికార్డులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవవినీతి ఊబిలో కూరుకుపోతుంది. ఇక్కడి అవినీతి ఏ స్థాయికి చేరిందంటే ఇటీవల ఓ బాధితుడు కార్యాలయంలోనే ఆత్మహత్యకు పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ కార్యాలయం అవినీతిపై గతంలో సాక్ష్యాత్తు శాసనసభ్యుడే కార్యాలయంకు వెళ్ళి అధికారులను మందలించడం గమనించదగ్గ విషయం.

## చిత్తూరు మేయర్ కుర్చీ...

# రిజర్వేషన్‌పై ఉత్కంఠత

**- ఓసీ, ఓసీ మహిళ, బిసీ జనరల్, ఎస్సీ మహిళకు రిజర్వ్ అయ్యే అవకాశం - 'దేశం' నుండి కాజూరు బాలాజీ, సికె లావణ్యబాబు, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, వసంత్‌బాబులు ఆశావాహులు**
**- వైకాపా నుండి రంగంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జీ సతీమణి, మాజీ డిప్యుటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, బిసీ నాయకుడు జ్ఞానజగదీష్‌లు**

చిత్తూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త: ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలకు ముహుర్తం ఖరారు చేయనుండటంతో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కుర్చీ రిజర్వేషన్‌పై ఉత్కంఠత నెలకొంది. మేయర్ కుర్చీ ఓసీ జనరల్, ఓసీ మహిళ, బిసీ జనరల్, ఎస్సీ మహిళకు రిజర్వ్ అయ్యే అవకాశం వుండటంతో జరుగనున్న ఎన్నికల్లో మేయర్ పదవిని ఎలాగైనా దక్కించుకోవవాలని ఇటు అధికార కూటమి ప్రభుత్వం, అటు వైకాపా నాయకులు ఇప్పటి నుండి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు 2014 సంవత్సరంలో మొదటిసారి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మేయర్ పదవి బిసీ మహిళలకు రిజర్వ్ కావడం, మేయరీ పదవికి పరోక్ష పద్ధతిలో ఎన్నికలు జరుగడంతో ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున విజయం సాధించిన దివంగత కఠారి అనురాధ మేయర్ పదవిని అధిష్టించారు. ఆమె మేయర్ పదవిలో వున్న సమయంలోనే ఆమె, ఆమె భర్తను హత్య చేయడంతో కొన్ని రోజుల అనంతరం ఆ స్థానంలో దివంగత మేయర్ కఠారి అనురాధ కోడలు కఠారి హేమలతను మేయర్ పదవిలో కుర్చొబెట్టారు. ఆపై 2021 సంవత్సరంలో జరిగిన పరోక్ష మేయర్ ఎన్నికల్లో మేయర్ కుర్చీ బిసీ జనరల్‌కు రిజర్వ్ కావడం, రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వుండటంతో మేయర్ ఎస్సీ జనరల్ స్థానంలో కార్పొరేటర్‌గా ఎన్నికైన ఎస్సీ మహిళను మేయర్ కుర్చీపై కుర్చొబెట్టారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో వైకాపా ఓడిపోవడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైకాపా మేయర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మేయర్ అముద తెలుగుదేశం జెండాకు జై చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో వున్న కూటమి ప్రభుత్వం మేయర్ ఎన్నికలను ప్రత్యక్ష పద్దతిలో నిర్వహించాలని నిర్ణయించడంతో చిత్తూరు మేయర్ కుర్చీపై ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించే అభ్యర్థుల కోసం ఇటు అధికార కూటమి నాయకులు, అటు వైకాపా నేతలు వెతుకులాట ప్రారంభించారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మూడు కీలక పదవులు వున్నాయి. ఇందులో ఒకటి ఎమ్మెల్యే పదవి కాగా మరో రెండు మేయర్, చుడా ఛైర్మన్ పదవులు వున్నాయి. సిఎం నారా చంద్రబాబునాయుడు ఈ ఎన్నికల్లో సామాజిక సమీకరణలు పక్కాగా అమలు చేయడంతో పాటు మేయర్ కుర్చీ ఓసీలకు రిజర్వ్ అయితే మాజీ ఎమ్మెల్యే సికె బాబు సతీమణి సికె లావణ్యబాబు ఎన్నికల బరిలో వుండాలని ఇప్పటి నుండి భావించి అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయి కార్యక్రమాలు చేసుకుంటు వెళ్తున్నారు. మరోవైపు మేయర్ కుర్చీ ఓసీ జనరల్ లేదా బిసీ జనరల్‌కు కేటాయిస్తే తెలుగుదేశం పార్టీ తరపున తనకు అవకాశం ఇవ్వాలని మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కాజూరు బాలాజీ ప్రయత్నాలను ముమ్మరంగా చేస్తున్నారు. ఇప్పటికే కాజూరు బాలాజీ ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుకు సన్నిహితంగా వుంటూ పార్టీ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్నారు. అలాగే తెలుగుదేశం పార్టీలో యువనేతగా ఎదుగుతున్న వసంత్‌కుమార్ నాయుడు మేయర్ కుర్చీ ఓసీ జనరల్‌కు రిజర్వ్ అయితే తనకు ఇవ్వాలని ఆ కుర్చీపై కన్నేసి క్షేత్ర స్థాయిలో తన వర్గంను బలోపేతం చేసుకుంటున్నారు. అలాగే ప్రస్తుతం చుడా ఛైర్‌పర్సన్‌గా వున్న మాజీ మేయర్ కఠారి హేమలత సైతం మరోసారి పూర్తి స్థాయిలో మేయర్ పదవిని అనుభవించాలని ఆశించి ఆ మేరకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు అగ్ర వర్గాలకు చెందిన వారు మేయర్ కుర్చీపై కుర్చుంటే మరో అధికార కేంద్రం ఏర్పడే అవకాశం వుండటంతో ఈ సారి మేయర్ ఎన్నికలు ప్రత్యక్షంగా జరుగుతుండటంతో మేయర్ పదవికి ఎస్సీ మహిళకు రిజర్వ్ అయితే మరో మూడేళ్ళ పాటు తనకు సమస్య వుండదని ఎమ్మెల్యే భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. మరోవైపు వైకాపా నుండి మేయర్ పదవి ఓసీ జనరల్ లేదా ఓసీ మహిళకు రిజర్వ్ అయితే ప్రస్తుత వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త ఎంసి విజయానందరెడ్డి తన సతీమణిని ఎన్నికల బరిలో నిలపాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. అలాగే బిసీ జనరల్‌కు మేయర్ కుర్చీ రిజర్వ్ అయితే మాజీ డిప్యుటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్‌తో పాటు బిసీ నాయకులు జ్ఞానజగదీష్‌లు మేయర్ ఎన్నికల రేసులో వుండనున్నారు. ఈ పరిస్థితుల్లో మేయర్ కుర్చీ ఏ వర్గానికి రిజర్వ్ అవుతుందా! అనే విషయంపై చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గత కొన్ని రోజులుగా ప్రజల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో మేయర్ కుర్చీ ఏ వర్గానికి రిజర్వ్ అవుతుంది! ప్రధాన పార్టీలు మేయర్ అభ్యర్థులుగా ఎవరికి ఖరారు చేస్తారు! అనే విషయంపై నెలకొన్న ఉత్కంఠత త్వరలో వీడనుంది.



## జగన్ మాట్లాడిన ప్రతి మాట...

# అబద్ధపు మాటలు

**- శాప్ ఛైర్మన్ రవి నాయుడు**

**- జగన్ ఏపీపీఎస్సీ, డిఎస్సి అంటే ఏమిటో తెలుసుకో !**



తిరుపతి హెల్త్, ఆగస్టు 21 ప్రభాతవార్త: పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి నిజాలు మాట్లాడితే అతని తల వేయి ముక్కలవుతుందని, నిజాలు చెప్పవద్దని అతని తండ్రి అతనికి సూచించాడని, నిన్న జరిగిన మీడియా సమావేశంలో జగన్ మాట్లాడిన ప్రతి మాట అబద్ధపు మాటలని, స్వయాన డిఎస్సి అభ్యర్థులు,ఆ ప్రక్రియలో భాగస్వామ్యం అయినటువంటి అధికారులు చెబుతున్న పదే పదే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని శాప్ ఛైర్మన్ రవి నాయుడు ఆరోపించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోల్డ్ మెడల్ దుర్గయ్య కోర్ట్ కు సబ్మిట్ చేశారని,అలాగే అవుట్ సోర్సింగ్ ఎంప్లాయ్ నవీన్ ఐడిని లాగిన్ క్లోజ్ చేస్తారనేది కూడా తెలియదని,ఇతనికి ఉద్యోగం ఇవ్వాలంటున్నాడో, ఇవ్వవద్దంటున్నాడో కూడా క్లారిటీగా జగన్ చెప్పడం లేదన్నారు. గతంలో గ్రామ సచివాలయ ఉద్యోగాలు అప్లై చేసిన వారందరికీ ఎందుకు ఉద్యోగాలు ఇవ్వలేదని,సచివాలయ ఉద్యోగుల నియామకాలలో మీరు తీసుకొన్న కమిషన్ పదివేల కోట్లు ఎవరి దగ్గరికి వెళ్ళాయో చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయ ఉద్యోగాల నియామకాలలో, డీఎస్సీ నియామకాల పైన చర్చకు సిద్ధమని అన్నారు. టెట్ క్వాలిఫై అయిన వారికి మాత్రమే టీచర్ ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఏ ప్రక్రియ ఏ సమస్థ ద్వారా ఉద్యోగాలు వస్తాయో! తెలియని అతను ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేయడం సిగ్గుచేటన్నారు. కరోనా ముసుగులో నువ్వు చేయాల్సిన అవినీతి చేసేసావని ఆరోపించారు. ఏపీపీఎస్సీ, గ్రూప్ 1 గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులు పారదర్శకంగా ఎలా చేశావయ్యా రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని, పత్రికా సమావేశాల ద్వారా జగన్ రెడ్డి తన టాలెంట్ ను తనే బయట పెట్టుకుంటున్నారని అన్నారు. ఏపీపీఎస్సీని భ్రష్టు పట్టించిన వ్యక్తి జగన్ అని, డీఎస్సీ, ఏపీపీఎస్సీ అంటే ఏమిటో? అనేది జగన్ తెలుసుకోవాలన్నారు. సిట్ నివేదికలో నిజాలు బయటపడుతున్న కొద్ది డీఎస్సీని తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. వివేక హత్య కేసు విషయంలో, పరకామణి విషయమై,లడ్డు కల్తీ, టిడిఆర్ బాండ్ల విషయంలో, ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గ్రూప్ వన్ పై ఎందుకు సిబిఐ ఎంక్వైరీ అడగలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో శ్రీ తాతయ్య గుంట గంగమ్మ గుడి ఛైర్మన్ మహేష్ యాదవ్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసు, గంగమ్మ గుడి డైరెక్టర్ వినుకొండ వెంకట్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్‌విఎం శ్రీధర్, తెలుగు యువత నాయకులు కొట్టే హేమంత్ రాయల్, గంగమ్మ గుడి మాజీ డైరెక్టర్ గంజి సుధాకర్ రెడ్డి, ముని రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

**-కుల ముద్ర నుండి బయట పడుతుందా?**

# సేన లేని...జనసేన!

ప్రభాతవార్త-తిరుపతి:

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జనసేన పార్టీ పరిస్థితి చాలా బలహీనంగా కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయినప్పటికీ క్షేత్ర స్థాయిలో కీలక పాత్ర పోషించడం లేదనేది ఆ పార్టీ వర్గాల్లోనే విమర్శలు వినిపిస్తున్నాయి. సినీ అభిమానుల నుండి రాజకీయ పార్టీగా, అక్కడి నుండి అధికార కూటమిలో కీలక భాగస్వామిగా ఎదిగిన జనసేనకు ఇప్పుడు మరో కీలక పరీక్ష ఎదురవుతోంది. అధినేత పవన్ కల్యాణ్‌కు ఉన్న వ్యక్తిగత ప్రజాదరణ, యువతలో ఆకర్షణ, 2024 ఎన్నికల్లో సాధించిన విజయాలు పార్టీకి రాజకీయ బలం ఇచ్చాయి. అయితే ఈ బలాన్ని శాశ్వతమైన సంస్థాగత శక్తిగా మార్చగలదా? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జనసేన పరిస్థితి సేన లేని జనసేన" అనే విమర్శకు కొంత రాజకీయ ప్రాతిపదిక కనిపిస్తోంది. నియోజకవర్గ స్థాయి నుండి మండల, గ్రామ, బూత్ స్థాయి వరకు నిరంతరం పనిచేసే కేడర్ వ్యవస్థ ఇంకా అన్ని ప్రాంతాల్లో సమానంగా బలపడలేదన్న అభిప్రాయం ఉంది. తిరుపతిలో శ్రీనివాసులు పార్టీ ఎమ్మెల్యేగా ఉండటం, కొన్ని ప్రాంతాల్లో కార్యకర్తల చురుకుదనం ఉన్నప్పటికీ, విస్తృత సంస్థాగత నిర్మాణం లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే విషయాన్ని జనసేన నాయకత్వం కూడా గుర్తించినట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేడర్ బలంగా ఉన్న ప్రాంతాల్లోనే పోటీ చేయాలని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ అధ్యక్షుడు నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. జిల్లా, పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని పెంచాలని కూడా నిర్ణయించినట్లు తెలిపారు.

**-కుల ముద్ర మరో సవాల్:**

జనసేన ఎదుర్కొంటున్న మరో రాజకీయ సవాలు ఒక సామాజిక వర్గానికి చెందిన పార్టీ అనే విమర్శ. పవన్ కల్యాణ్‌కు ఒక నిర్దిష్ట సామాజిక వర్గంలో ఉన్న బలమైన మద్దతును ఆధారంగా చేసుకుని ప్రత్యర్థులు ఈ ముద్ర వేస్తున్నారు. అదే సమయంలో జనసేన నాయకులు మాత్రం పవన్ కల్యాణ్ రాజకీయాలు కుల పరిమితులను దాటి అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్నాయని చెబుతున్నారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, మహిళలు, యువతకు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో తగిన ప్రాతినిధ్యం కల్పించినప్పుడే జనసేనపై ఉన్న కుల ముద్ర క్రమంగా తొలగే అవకాశం ఉంటుంది.పవన్ కల్యాణ్ కూడా ఇటీవల కుల ఆధారిత రాజకీయ ధోరణులను, ఒక సామాజిక వర్గాన్ని మరో వర్గానికి వ్యతిరేకంగా నిలబెట్టే రాజకీయాలను విమర్శించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో జనసేన తన స్వంత బలాన్ని ఎంతవరకు నిర్మించుకుందన్నది ప్రశ్నార్థకమే. కూటమి బలం ఒకటి.. జనసేన స్వంత సంస్థాగత బలం మరొకటి. చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, పుంగనూరు, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె వంటి ప్రాంతాల్లో పార్టీకి స్థానికంగా బలమైన నాయకత్వాన్ని తయారు చేయాల్సిన అవసరం ఉంది. ఇటీవల తిరుపతిలో జరిగిన జనసేన సమావేశంలో స్థానిక నాయకత్వం, కేడర్‌ను పట్టించుకోవడం లేదని కొందరు కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేసిందీ తెలిసిందే.

## సాధారణ రాహుకేతు పూజలకు...

# రెండు కొత్త మండపాలు

**ఆలయం ఇఓ, ఛైర్మన్లు వెల్లడి**



మీడియాసమావేశంలో మట్లాడుతున్న ఇఓ ఛైర్మెన్

శ్రీకాళహస్తి,ఆగస్టు 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాబోవు రోజుల్లో భక్తులకు సకల సదుపాయాలు కల్పించుటకు నిర్ణయాలు తీసుకున్నట్లు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ ఛైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్,ఇఓ బికె వెకంటేశులు వివరించారు.ఈ సందర్భంగా గత ఐదు నెలల్లోఇఓగా వెంకటేశులు బాధ్యతలు చేపట్టిన తరువాత అమలు చేసిన 150మంచి పనుల గురించి వివరించారు.అలాగే ఛైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ కొత్తగా ప్రతిపాదించిన ప్రగతిపనులను వివరించారు. రాబోవు రోజుల్లోరూ.500ల రాహుకేతుదోష నివారణ పూజలు జరుపుకునే భక్తులకు రెండు కొత్త మండపాలను పాతాళ వినాయకుని ఆలయం ఎదురుగా రంగుల గోపురం రెండవ గోపురం మధ్యలో రెండు మండపాలను ధార్మిక చింతన వెల్లివిరిసేటట్లు నిర్మించుటకు ధర్మకర్తల మండలి తీర్మానించిందని ఈ పనులు టెండర్ స్థాయికి వచ్చిందన్నారు.ఒకే సారి వెయ్యిమంది పూజలు జరిపించు కునేటట్లు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.ఈ మండపాల్లో భక్తులకు చక్కటి సదుపాయాలు కల్పించామన్నారు. ఎసిలు ఎల్ఇడిలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కాగా క్యూలైన్లలో భక్తులు కూర్చొటానికి రూ.29లక్షలతో సీటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాగా భక్తుల సౌకర్యార్థం రెండవ గోపురం నుంచి టూరిస్టుబస్టాండు వరకు మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించుటకు అంచనా ప్రతిపాదనలు ఆమోదించామన్నారు.

**గంగాసదన్‌వద్ద సామాన్యులకు కళ్యాణ మండపం:**

శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో నిరుపేదలకు సదుపాయంగా సకల హంగులతో కళ్యాణ మండపం నిర్మించుటకు ప్రతిదించామని ఇఓచైర్మెన్ వివరిం చారు. అలాగే ప్రస్తుతం అన్నదాన మండపం భక్తులకు చాలటం లేదు.కాబట్టి పై భాగంలో రూ.1.29కోట్లతో మరోమండపం నిర్మించుటకు నిర్ణయించినట్లు వివరించారు.మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి ఇఓ మాట్లాడుతూ ఒకే ఒక భవనం ఇబ్బందిగా మారిందని కాబట్టి 'తప్పని సరి భూసేకరణ'ను చేపట్టనున్నట్లు నాలుగునెలల్లో ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు.

అలాగే గిరిప్రదక్షిణ సందర్భంగా ప్రతిపౌర్ణమికి భక్తులు ఇబ్బందులుపడుతున్నట్లు వివరిస్తూ దారిపోడవునా ఎల్ఇడి లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు అలాగే భక్తులకు మంచినీటి సదుపాయం, అల్పాహారం ఏర్పాటుకు నిర్ణయించినట్లు వివరించారు.తాము స్వల్ప కాలంలో వసతి గృహాల్లో భోజన వసతి, ఉచిత బస్సు, వాటర్ కూలర్స్, చార్జింగ్ పాయింట్లు, ఎసిలు, 24గంటలు అంబులెన్స్ సదుపాయం రాహుకేతుదోష నివారణ పూజల్లో కూర్చొటానికి పీటలు ఏర్పాటుచేసామన్నారు. అలాగే కమాండ్‌కంట్రోల్ రూం ఏర్పాటు చేసామన్నారు. ఇక సుమారు రూ.100కోట్లు వెచ్చించి భూసేకరణ చేసామనిఅయితే ఏళ్ళు గడిచినా మున్సిపల్ పరిధిలో పేర్లుమారలేదన్నారు.దానిని గుర్తించి దేవస్థానం పేరుమీద మార్చుకున్నామన్నారు. గోశాలలో పశువులకు ఆరోగ్య రీత్యా ఫాగర్స్ ఏర్పాటు చేసామని అలాగే ప్రింక్లర్స్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

**కొత్త సేవలకు శ్రీకారం:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొత్తసేవలకు ప్రతిపాదించినట్లు వివరించారు. నిత్యావస్త్రాలంకరణ, నిత్యదీపాలంకరణ, నిత్యపులంగి సేవ, నిత్య ప్రసాద్ సేవ, నిత్యాలంకరణ, లేపాక్షి ఎంపోరియం ప్రవేశ పెడుతున్నట్లు వివరించారు. అర్థనారీశ్వరాలయంలో కొత్తగా కుంకుమ సేవ ప్రవేశపెట్టాం, దానికి టిక్కెట్లు రూ.200లు ఖరారుచేసినట్లు వివరించారు.

# గుడ్ మార్నింగ్ పెళ్ళకూరుతో... గ్రామాల్లో అలజడి -కూటమి నేతలు



ఆందోళన చేస్తున్న కూటమి నేతలు

పెళ్లకూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త: వైయస్సార్ సిపి నాయకులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నిర్వహిస్తున్న గుడ్ మార్నింగ్ పెళ్లకూరు కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అలజడులు సృష్టించి ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారని కూటమి నాయకులు అన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పాలనతో రాష్ట్రంలో ప్రజలు ఆనందంగా ఉంటే దానిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా పెళ్ళకూరు మండలంలోని గుడ్ మార్నింగ్ పెళ్లకూరు కార్యక్రమం ద్వారా గ్రామాల్లో తిరుగుతూ ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి గొడవలు పెడుతున్నారని సత్యనారాయణ రెడ్డి పై కూటమి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులకు ఏవైనా సమస్యలు ఉంటే ప్రభుత్వానికి అర్జీల ద్వారానో నిరసనల ద్వారానో తెలియజేయాలే గాని ఈ విధంగా గ్రామాల్లో తిరుగుతూ సంతోషంగా ఉన్న ప్రజల మధ్య గొడవలు సృష్టించడం మంచిది కాదని సత్యనారాయణ రెడ్డికి హితవు పలికారు. సత్యనారాయణ రెడ్డి నిర్వహిస్తున్న గుడ్ మార్నింగ్ పెళ్లకూరును అడ్డుకున్న కూటమి నాయకులు పూనబాకలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి సత్యనారాయణ రెడ్డి ఈ కార్యక్రమంలో ఆపేయాలని లేనిపక్షంలో మండలంలో ఎక్కడ జరిగిన కూటమి నాయకులు తప్పకుండా అడ్డుకొని తీరుతారని ఆవేశం వ్యక్తం చేశారు.

# కుప్పంలో చీటీల నిర్వాహకుడు పరార్

**- సుమారు యాభైమందికి 1.50 కోట్లకు పైగా ఎగనామం..?**

కుప్పం, ఆగస్టు 21 ప్రభాతవార్త: ప్రతినెలా చీటీలు నిర్వహిస్తున్న ఓ చీటీల నిర్వాహకుడు కుటుంబంతో సహా పరారైన సంఘటన కుప్పంలో వెలుగుచూసింది. ఈ మేరకు సుమారు యాభైమంది బాధితులు శుక్రవారం రాత్రి అర్బన్ సిఐ సయ్యద్ హాషంకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన మేరకు వివరాలిలా.. కుప్పం పట్టణం మ ర్రిమానువీధికి చెందిన ఓ మహిళ సుమారు ఇరవై ఏళ్లుగా చీటీలు నిర్వహిస్తోంది. వివిధ చోట్ల పనిచేసే ఉద్యోగులు,స్థానికులు ఎంతో నమ్మకంతో ఆమె వద్ద చీటీలు వేసేవారు. ఆ మహిళ కుమారుడు ఫయాజ్ అనే వ్యక్తి కూడా తన తల్లితో పాటు చీటీలు నిర్వహించేవాడని చెప్పారు. ఇటీవలి కాలంలో చీటీలు పాడుకున్న వారికి చీటీల నగదు ఇవ్వకుండా వాయిదాలు వేసి రేపు,మాపు అని తిప్పుకునే వాడన్నారు. ఈ నేపథ్యంలో అమరావతి కాలనీలో ఫయాజ్ నిర్మించుకున్న ఇంటిని విక్రయించి కొందరికి నగదు ఇస్తామని చెప్పి ఆ నగదుతో సహా పరారైనట్లు బాధితులు తెలిపారు. మూడు రోజుల నుంచి ఫయాజ్ కుటుంబీకులు ఎవరూ కన్పించకపోవడంతో బాధితులు సుమారు యాభైమంది చీటీల నిర్వాహకుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కాగా చీటీల నిర్వాహకుడు బాధితులకు ఇప్పటికే 1.50కోట్లకుపైగా చెల్లించాల్సి ఉందని బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.




# శక్తి యాప్‌పై మహిళలకు ఎస్ఐ విస్తృతంగా అవగాహన



**చిత్తూరుహెల్త్, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
శక్తి యాప్ వినియోగంపై మహిళలకు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ కరీమున్నీసా శుక్రవారం విస్తృతంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా స్టేషన్ డిఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళా స్టేషన్ ఎస్ఐ కరీమున్నీసా చిత్తూరు గిరింపేట దుర్గమ్మగుడి వద్ద శుక్రవారం మహిళలకు శక్తి యాప్ ఆవశ్యకత, ఉపయోగాలు, మహిళల భద్రతకు పోలీసులు అందించే సహాయం తదితరాలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు, బాలికలు పోలీసుల సహాయంను త్వరగా పొందడానికి శక్తి యాప్ ఎంతో ఉపయోగపడుతుందని వారికి మహిళా ఎస్ఐ అవగాహన కల్పించారు. దుర్గమ్మ గుడి ఆవరణకు వచ్చిన మహిళలు, బాలికల మొబైల్ ఫోన్లలో శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసి దాని వినియోగ విధానంను వివరించారు. అలాగే మహిళలు, బాలికలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా వుండటం, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించడం, మహిళలపై జరిగే నేరాలు, వేధింపులు లేదా అనుమానస్పద పరిస్థితులు ఎదురైనపుడు సత్వరం పోలీసుకు సమాచారం అందించడం వంటి అంశాలపై మహిళా ఎస్ఐ కరీమున్నీసా అవగాహన కల్పించారు. శక్తియాప్ అనేది మహిళల భద్రతకు ఒక ముఖ్య భద్రతా సాధనమని, ప్రతి మహిళ తన మొబైల్ ఫోన్‌లో శక్తియాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించాలని మహిళా ఎస్ఐ సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, బాలికలు, మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దూషణ ఆరోపణలపై డీవైఈఓ విచారణ

**తవణంపల్లె, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
మండలంలోని అరగొండ జడ్పీ బాలురోన్నత పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయుడు కులంపేరుతో దూషించారన్న ఆరోపణలపై చిత్తూరు డీవైఈఓ శనివారం పాఠశాలలో విచారణ జరుపనున్నారు. అరగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సునీల్‌కుమార్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రార్థనా సమావేశం సందర్భంగా కులంపేరుతో దూషించిడంతో పాటు వారి సామాజిక స్థితిని అవమానించడం, వారి తల్లిదండ్రులపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్సీ సంఘం నాయకులు మండల, జిల్లా విద్యాశాఖాధికారులకు, మానవ హక్కుల కమీషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఈసంఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని విచార ణాధికారిగా చిత్తూరు డీవైఈఓ ఇందిరను నియమిస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు డీవైఈఓశనివారం ఉదయం పాఠశాలకు చేరుకుని విచారణ జరుపనున్నట్లు ఎంఈఓ హేమలత తెలిపారు.

## కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వం

– ఏరియా ఆస్పత్రి వైస్‌చైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్



**కుప్పం, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని కుప్పం ఏరియా ఆస్పత్రి వైస్‌చైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధి అనిమిగానిపల్లి బూత్‌నెం175, 176లో ఆమె ఇంటింటికీ తెదేపా కార ్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా గత రెండేళ్లలో సిఎం చంద్రబాబు చేసిన అభివృద్ధి, సంక్షేమాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తూ వారికి కరపత్రాలు పంచారు. సూపర్‌సిక్స్ పథకాల అమలుతో పాటు కుప్పానికి కృష్ణాజలాలు,32 పరిశ్రమలు తెచ్చారన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రజలు కూడా కూటమి ప్రభుత్వాన్ని మరింత ఆదరించాలని ఆమె కోరారు.

## నేడు కుప్పంలో విద్యుత్ అంతరాయం

**కుప్పం, ఆగస్టు21 ప్రభాతవార్త:**
కుప్పంలోని 33/11కెవి విద్యుత్‌సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా శనివారం కుప్పం, కుప్పం గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, ఎండి సోమశేఖర్ తెలిపారు. ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట దాకా విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఘనంగా వరలక్ష్మి వ్రతం పూజలు

**శాంతిపురం, ఆగస్టు21 ప్రభాతవార్త:**



వరలక్ష్మి వ్రతం పూజలను మండలంలో మహిళలు తమ ఇళ్లల్లో ఘనంగా నిర్వహించారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ఇళ్లల్లో వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు. ఈ వ్రతం ఆచరిస్తే అష్టైశ్వర్యాలు లభించడంతో పాటు మహిళలకు సుమంగళితనం ఉ ం టుందని మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రంముత్తైదువులను ఇళ్లకు పిలిచి వారికి పసుపు,కుంకుమ,సారె అందజేశారు.

## బంగారుకుటుంబాల జీవితాలకు భరోసా

**రామకుప్పం, ఆగస్టు 21ప్రభాతవార్త:**



మండలంలో ఉన్న నిరుపేద బంగారు కుటుంబాల జీవితాలకు సిఎం చంద్రబాబునాయుడు పి4కార్యక్రమంలో భరోసా కల్పిస్తున్నారని టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆనిగానూరులో గణపతికి చిల్లరకొట్టు, మణీంద్రంలో నిరుపేద కుటుంబంకు ఆటో కొనుగోలుకు ఆర్థికసాయం, పంద్యాలమడుగులో అశోక్ అనే వ్యక్తికి 75వేలతో వెల్డింగ్ దుకాణం, రామకుప్పంలో మురుగన్‌కు కూరగాయల దుకాణంకు ముప్పై వేలు, శేఖర్‌కు సెలూన్ షాప్‌కు ఆర్థికసాయాన్ని దాతల సహకారంతో నేతలు అందించారు. కార్యక్రమంలో నేతలు కామరాజు నాయక్, సీతాపతి, రామూర్తి, కృష్ణనాయక్, విశ్వనాథ్, రవిరెడ్డి, రఫీ, నాగభూషణం, విజయ్‌రెడ్డి, శంకరాచలం, గజేంద్ర, నియాజ్, అప్పాలప్ప, అల్లిశీను, బాలరాజు, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వరలక్ష్మి వ్రతం

**రామకుప్పం, ఆగస్టు21 ప్రభాతవార్త:**
మండలంలో వైభవంగా వరలక్ష్మి పూజలను మహిళలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్లల్లో లక్ష్మీదేవి ప్రతిమలు ఏర్పాటుచేసి మహిళలు వరలక్ష్మి వ్రతం జరిపారు. మహిళలకు పసుపు కుంకుమలు అందించారు.

## వైభవంగా వరలక్ష్మీ వ్రతం



**పెనుమూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మహిళలు వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. మహిళలు అయా గ్రామాల్లోని తమ నివాసాల్లో వరలక్ష్మీ అమ్మవారిని ప్రతిష్టించుకుని వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించి పూజలు చేపట్టారు. పురోహితులు గుంటూరు శివరామశర్మ వేద మంత్రోచ్ఛారణతో వరలక్ష్మీ అమ్మవారికి పంచామృతం, పసుపు, కుంకుమలతో అభిషేక సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. అలాగే వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళలు కుంకుమార్చనలు నిర్వహించి చేతికి తోరణం కట్టుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ముత్తయిదవులకు వాయినాలు సమర్పించారు.

## కొట్టాలం జల్లికట్టు నిర్వహణపై ఉత్కంఠత

**యాదమరి, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
ఓ వైపు యాదమరి మండలం కొట్టాలం గ్రామంలో ఆదివారం జల్లికట్టు ఉత్సవాలు నిర్వహించడానికి ఎట్టి పరిస్థితుల్లోను అనమతించమని పోలీసులు స్పష్టం చేస్తుండగా మరోవైపు ఎలాగైనా కొట్టాలం గ్రామంలో నిర్ణయించిన మేరకు జల్లికట్టు ఉత్సవాలు నిర్వహించాలని నిర్వాహకులు ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తుండటం మండలంలో ఉద్రిక్తత పరిస్థితులకు దారి తీస్తుంది. ప్రతి ఏడాది కొట్టాలం గ్రామంలో పశువుల పందెలు, జల్లికట్టు, బుల్‌రేస్‌లు నిర్వహించేవారు. ఈ ఉత్సవాల నిర్వహణకు పోలీసులు సైతం చూసి చూడనట్లు ఊరుకొనే వారు. జల్లికట్టు ఉత్సవాలు పురస్కరించుకుని ఎక్కడా ఏ ప్రమాదం జరగని వరకు అంత బాగానే వుంటుంది. జల్లికట్లు ఉత్సవాల్లో ఎదైనా ప్రమాదం జరిగితే పోలీసులు నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తారు. గతంలో కొట్టాలం గ్రామంలో నిర్వహించిన జల్లికట్టు ఉత్సవాల్లో ఓ వ్యక్తి మృతి చెందడంతో పోలీసులు నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. ఆ కేసు ఇప్పటికీ కోర్టులో నడుస్తోంది. ఈ క్రమంలో కొట్టాలంలో ఈ ఏడాది ఎలాగైనా జల్లికట్టు నిర్వహించాలని ఏర్పాట్లు ముమ్మరంగా చేపడుతున్నారు. కొట్టాలం గ్రామంలో అధికార పార్టీకి చెందిన నాయకులు నేతృత్వంలో జల్లికట్టు ఉత్సవాలు నిర్వహించడానికి సిద్ధం కావడంతో స్థానిక తెలుగుదేశం నాయకులు జల్లికట్టు బహుమతుల పోస్టర్లలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొరార్జీ, మండల తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ రబ్బీల పేర్లు ముద్రించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు సైతం జల్లికట్టు జరుగకుండా చిత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఈ నెలాఖరు వరకు పోలీస్ 30 యాక్ట్ అమలులో వుంటుందని, ఎవరైనా ఉత్సవాలు, కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే పోలీసుల ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ ఈశ్వర్‌యాదవ్ రెండు రోజుల క్రితమే స్పష్టం చేశారు. ఈ పరిస్థితుల్లో ఆదివారం కొట్టాలం గ్రామంలో జల్లికట్టు ఉత్సవాలు నిర్వహించడదానికి పోలీసులు అనుమతి ఇస్తారా! లేక పోలీసుల అనుమతిని పట్టించుకోకుండా జల్లికట్టు ఉత్సవాలను గ్రామస్తులు నిర్వహిస్తారా! అనే విషయంపై ఉత్కంఠత నెలకొంది.

## తప్పిపోయిన వ్యక్తిని సురక్షితంగా...

ఇంటికి చేర్చిన పోలీసులు



**చిత్తూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
ఎన్ఆర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో మతితప్పిన వ్యక్తి తప్పిపోవడంతో అతనిని వెతికి ఎన్ఆర్ పేట పోలీసులు సురక్షితంగా అతనిని ఇంటికి చేర్చారు. కర్నాటక రాష్ట్రం చిక్‌బళ్ళాపూర్ జిల్లా గుడిబండ ప్రాంతంకు చెందిన ఎన్.రాజేష్(31) మతి స్థిమితం సరిగా లేక ఆగస్టు 6 నుండి స్థానికంగా కన్పించకుండా పోయాడు. ఈ మేరకు ఎన్.రాజేష్ కుటుంబసభ్యులు గుడిబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఎన్ఆర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో మతిస్థిమితం సరిగా లేని ఓ వ్యక్తి సంచరిస్తుండటంతో అతనిని పోలలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తిని విచారించగా తన పేరు రాజేష్ అని చెప్పడంతో అతని వివరాలను సేకరించి గుడిబండ పోలీసులకు సమాచారం అందజేశారు. రాజేష్ గుడిబండ ప్రాంతంలో తప్పిపోయిన వ్యక్తిగా పోలీసులు నిర్ధారించారు. అనంతరం గుడిబండ పోలీసుల ద్వారా రాజేష్ కుటుంబసభ్యులకు ఎన్ఆర్ పేట పోలీసులు సమాచారం అందించడంతో రాజేష్ సోదరుడు శుక్రవారం ఎన్ఆర్‌పేటకు చేరుకుని తగిన ధృవీకరణ ఆధారాలను చూపడంతో ఎన్ఆర్‌పేట పోలీసులు రాజేష్‌ను సురక్షితంగా కుటుంబసభ్యులకు అప్పగించారు.

## నాయనూరు అటవీ ప్రాంతం చేరిన జంట ఏనుగులు

**కుప్పం, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
రామకుప్పం మండలం నుంచి కుప్పం మండలం నూలుకుంట అటవీ ప్రాంతంలో వచ్చిన ఏనుగులు మరలా నాయనూరు అటవీ ప్రాంతంలోకి శుక్రవారం సాయంత్రం చేరాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం దాకా జంట ఏనుగులు దాసేగానూరు సమీపంలోని రామ్‌నగర్ ప్రాంతంలో తిష్ట వేశాయి. అటవీ అధికారులు, సిబ్బంది ఏనుగులను దారి మళ్లించే యత్నం చేయగా ప్రస్తుతం అవి నాయనూరు అటవీ ప్రాంతంలో చేరాయి. దీంతో తిర్లాబండ, కంగుంది, రామాపురం తదితర ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచించారు. రాత్రిపూట ఎవరూ పొలాల వైపు వెళ్లరాదని హెచ్చరించారు. అయితే ఈ జంట ఏనుగులు మరలా రామకుప్పం వైపు వెళ్లే అవకాశం ఉందని అటవీ అధికారులు చెబుతున్నారు.

# బృందావన్ స్కూల్‌కు జాతీయస్థాయి పురస్కారం




**చిత్తూరురూరల్, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తున్న బృందావన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌కు జాతీయస్థాయిలో అరుదైన గౌరవం లభించింది. హైదరాబాద్ హైటెక్ సిటీలోని మేడన్ ఎక్స్‌పో సెంటర్ నందు ఈనెల 21,22 తేదిలలో నిర్వహిస్తున్న భారత్ ఎడ్యుకేషన్ సమ్మిట్ 2026లో పాఠశాల చైర్‌పర్సన్ డా.ఎల్.శైలజకుమారి ఏపిజె అబ్దుల్ కలాం ఇగ్నైటెడ్ మైండ్ చైర్‌పర్సన్ అవార్డు, ప్రిన్సిపాల్ టివి సుబ్రమణ్యం ఏపిజె అబ్దుల్ కలాం ఇగ్నైటెడ్ మైండ్ ప్రిన్సిపాల్ అవార్డు ఒకే వేదికపై అందుకొన్నారు. మారుతున్న విద్య అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడం,నాణ్యమైన విద్యను అందించడం, నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మకత, సాంకేతికత, విలువల ఆధారిత విద్యకు ప్రాధాన్యతనిస్తూ చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డులను అందుకోవడం ఎంతో సంతోషంగా వుండని చైర్‌పర్సన్ శైలజకుమారి తెలిపారు. కాగా అవార్డులందుకొన్న పాఠశాల చైర్‌పర్సన్ డా.ఎల్ శైలజకుమారి, ప్రిన్సిపాల్ టివి సుబ్రమణ్యంకు బృందావన్ ఇంగ్లీషు మీడియం స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## ఒంటరి ఏనుగు హల్ చల్!

**పలమనేరు, ఆగస్టు 21 ప్రభాతవార్త:**



పలమనేరు గుడియాతం రోడ్డు లోని ఇందిరానగర్ వద్ద గురువారం అర్ధరాత్రి ఒంటరి ఏనుగు హల్ చల్ చేసింది. సమీపంలోని అటవీ ప్రాంతం నుండి గ్రామ పొలిమేరల్లోని పంటపొలాల్లోకి ప్రవేశించింది. ఏనుగు అరుపులకు నిద్ర లేచిన గ్రామస్థులు వెంటనే కర్రలు రాళ్లు డప్పులు తీసుకొని కేకలు వేశారు. దీంతో ఏనుగు పరుగులు తీసింది. అప్పుడే గ్రామంలోకి వస్తున్న ట్రాక్టర్ ను అడ్డుకుంది. డ్రైవర్ ప్రాణభయంతో పరుగులు తీశాడు. ఇక గ్రామంలోకి ఏనుగు ప్రవేశించడంతో గ్రామస్థులు రాత్రంతా కంటి మీద కునుకు లేకుండా జాగరణ చేశారు. చివరకు ఏనుగు తెల్లవారు జామున ఎప్పుడో అడవిలోకి వెళ్ళి పోయింది. దీంతో గ్రామస్థులు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

## వైభవంగా వరలక్ష్మీ వ్రతం




**పలమనేరు, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
వరలక్ష్మి వ్రతం పలమనేరులో శుక్రవారం వైభవంగా జరుపుకున్నారు. మారెమ్మగుడి వద్ద మహిళలు ప్రత్యేక పూజలు. అభిషేకాలు చేశారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పవిత్ర మురళి కృష్ణ అమ్మవారికి పూజలు చేసి మహిళలకు చీరలు. పసుపు. కుంకుమలు. గాజులు. ప్రత్యేక కానుకలు వాయనాలు యిచ్చి ఆశీర్వాదాలు అందుకున్నారు. ఇళ్ల వద్ద కూడా గృహస్థులు అమ్మవారి చిత్రపటాలు విగ్రహాలు నిలిపి భక్తి శ్రద్ధలతో ఉపవాసాలతో పూజలు చేసారు. శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారం పవిత్రం కావడంతో మహాలక్ష్మి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ముఖ్యంగా వివాహిత మహిళలు కుటుంబ సంక్షేమం కోసం ఈ పూజలు చేస్తారు. అష్టలక్ష్మి ఆరాధన ఎంత ఫలితం ఇస్తుందో వరలక్ష్మి వ్రతం కూడా అంతే ఫలితం ఇస్తుందని భక్తుల విశ్వాసం.

## అర్హులైన ఓటర్లను తొలగిస్తే ఆందోళన తప్పదు : సీపీఐ



**పలమనేరు, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
అర్హులైన ఓటర్లను తొలగిస్తే ఆందోళన తప్పదని సీపీఐ నాయకులు హెచ్చరించారు. శుక్రవారం గంగమ్మతోపులోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు మాట్లాడుతూ బి ఎల్ ఓ లు సర్ పేరుతో అధికారపార్టీ నాయకుల ఒత్తిడికి లొంగి బతికి ఉన్నవారిని కూడా చంపేశారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బి ఎల్ ఓ లు అర్హులైన ఓటర్లు అందరికీ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు కూడా గతంలోని ఓటరు లిస్టులు పరిశీలించి అక్రమంగా తొలగించిన ఓటర్లకు న్యాయం చేయాలని కోరారు.. ఉద్దేశ పూర్వకంగా ఓటర్లను తొలగించిన బి ఎల్ ఓ ల పై చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు చిన్న కేశవులు. మంజునాథ్. రమేష్.గుర్రప్ప. రామ్మూర్తి. సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు మేము సిద్ధం : వైసీపీ



**పలమనేరు, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
మున్సిపల్ ఎన్నికలకు వైసీపీ సిద్ధమని. ఆపార్టీ. అర్బన్ కన్వీనర్ హేమంతకుమార్‌రెడ్డి తెలిపారు. మాజీ ఎంఎల్ ఏ వెంకటేగౌడ ఆదేశాల మేరకు స్థానిక పార్టీ కార్యాలయం వద్ద కొత్తగా ముద్రించిన ఓటరు లిస్టును ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్లు తమ పేర్లను మరోసారి ఓటరు లిస్టులో పరిశీలించి కోవాలని సూచించారు. జరగబోవు మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ విజయభేరి మోగించి వైసీపీ జెండా ఎగుర వేయాలని కోరారు. నాయకులు చెంగారెడ్డి. బాలాజీ నాయుడు. శ్యాం కమాల్ భాష. రహీం ఖాన్ గోవిందరెడ్డి. వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ రేషన్ బియ్యం పట్టివేత - వ్యక్తి అరెస్టు

**గుడిపాల, ఆగస్టు 21 ప్రభాతవార్త:**




తమిళనాడు నుండి రేషన్ బియ్యంను అక్రమంగా ఆంధ్రాకు తరలిస్తున్న వ్యక్తిని గుడిపాల పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రామ్మోహన్ వివరాల మేరకు తమిళనాడు నుండి అక్రమంగా రేషన్ బియ్యంను ఇక్కడికి తరలిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం రావడంతో తాను సిబ్బందితో కలసి పశుమంద క్రాస్ వద్ద శుక్రవారం తనిఖీలు నిర్వహించడం ప్రారంభించామన్నారు. ఈ క్రమంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో ఒక ప్యాసింజర్ ఆటో పోలీసులను చూసి తిప్పుకుని పారిపోవడానికి ప్రయత్నించాడు. ఈ పరిస్థితుల్లో ఎస్ఐ రామ్మోహన్ ఆటోను వెంబడించి ఆటో డ్రైవర్‌ను విచారిచంగా ఆటోలో 700 కేజీల తమిళనాడు రేషన్ బియ్యం వున్నట్లు గుర్తించారు. ఈ మేరకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకుని ఆటోడ్రైవర్ ఎలుమలై మాసిలామణి(40)పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

22CTR 3:22CTR 3.qxd 8/22/2026 12:04 AM Page 1



# గ్రామ పంచాయతీ ఎన్నికలకు కసరత్తు

**-పోలింగ్ కేంద్రాల నుంచి ఓటరు జాబితాల వరకు షెడ్యూల్ విడుదల**
**-ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేసే దిశగా కీలక అడుగులు**

**తిరుపతిరూరల్, ఆగస్టు21 ప్రభాతవార్త:**
రాష్ట్రంలో జరగనున్న గ్రామ పంచాయతీ రెండో సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం విస్తృత షెడ్యూల్‌ను విడుదల చేసింది. గ్రామ పంచాయతీ సంస్థల గడువు ముగియడంతో ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేస్తూ ప్రభుత్వం ముందడుగు వేసింది.అన్ని దశలను సమయానికి పూర్తి చేసి, ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు నుంచి తుది ఓటరు జాబితాల ప్రచురణ వరకు ప్రతి దశకు స్పష్టమైన కాలపట్టికను ఖరారు చేస్తూ...అధికారులకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఎన్నికల నిర్వాహణలో భాగంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కీలక బాధ్యతలు చేపట్టగా, మండల స్థాయిలో ఎంపిడిఓలు, తహశీల్దార్లు ప్రాధమిక ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

**పోలింగ్ కేంద్రాలపై స్పష్టమైన నిబంధనలు:**
ప్రతి వార్డుకు కనీసం ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సుమారు 650 మంది ఓటర్లకు ఒక కేంద్రం ఉండేలా ప్రణాళిక సిద్ధం చేయాలని మార్గదర్శకాలు చెబుతున్నాయి. ఒకే వార్డులో ఓటర్లు అధికంగా ఉంటే అదనపు కేంద్రాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు వంటి ప్రజలకు సులభంగా చేరుకునే ప్రదేశాల్లో ఉండాలని సూచించారు. ఏ ఓటరు కూడా 2 కిలోమీటర్లకు మించి ప్రయాణించాల్సిన అవసరం లేకుండా చూసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

**ఓటరు జాబితాలు – దశలవారీ ప్రక్రియ:**
గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటరు జాబితాలు 01జనవరి2026 అర్హత తేదీ ఆధారంగా ప్రచురించబడతాయి. అలాగే ఎస్సీ, ఎస్టీ, బి.సి వర్గాలకు చెందిన ఓటర్ల గుర్తింపు కోసం 7దశల ప్రక్రియ అమలు చేయబడుతుతోంది. ఇందులో ఇంటింటి సర్వే, డ్రాఫ్ట్ జాబితాల ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ, గ్రామసభలో ధృవీకరణ వంటి దశలు ఉన్నాయి.

**బి.సి.లకు 34శాతం రిజర్వేషన్ పునరుద్ధరణ:**
పంచాయతీరాజ్ సంస్థలో వెనకబడిన తరగతులకు 34శాతం రిజర్వేషన్‌ను ప్రభుత్వం పునరుద్ధరించింది. గ్రామ పంచాయతీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జడ్పిటిసిలు తదితర పదవులకు ఇది వర్తించనుంది. ఈ నిర్ణయం ఎన్నికల రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.మొత్తంగా ఈ షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, గ్రామస్థాయిలో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుంది.

## దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్ : కమీషనర్



**కుప్పం, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
వాతావరణంలో మార్పుల దృష్ట్యా కుప్పం మున్సిపాలిటీలో విష జ్వరాలు వ్యాపించకుండా దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మునస్వామిపురం కాలనీ, వినాయకపురం గ్రామాల్లో కార్మికులచే కాలువలు శుభ్రం చేయించి దోమల లార్వాల నిల్వలు పెరగకుండా మలాథియాన్ స్ప్రేచేయించి బ్లీచింగ్ చేయించినట్లు తెలిపారు. ప్రజలు కూడా తమ నివాస గృహాల మధ్య నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## తెదేపాలో కష్టపడి పనిచేసేవారికి తప్పక గుర్తింపు



**చిత్తూరురూరల్, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసేవారికి ఎప్పుడూ పార్టీ అండగా వుంటుందని చిత్తూరు నియోజకవర్గం అనంతాపురంకు చెందిన ఆర్ ప్రవీణ్‌కు మంత్రి నారాలోకేష్ ధైర్యం చెప్పారు. స్థానిక నాయకులు పార్టీలో క్రియాశీలకంగా పనిచేయడానికి కూడా అడ్డంకులు సృష్టిస్తున్నారనీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లే సమయంలో ఉద్దేశపూర్వకంగా అడ్డుకొని దాడులు నిర్వహించి పోలీసులతో అక్రమ కేసులు పెట్టించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రవీణ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ కష్టపడి పనిచేసేవారికి ఎప్పుడూ అండగా వుంటుందని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రానున్న మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు నారాలోకేష్ సూచించినట్లు ప్రవీణ్ తెలిపారు.

## యనమల నియామకంపై అనాల సునీల్ హర్షం.



**చిట్వేలి,ఆగస్టు 21, ప్రభాతవార్త:**
జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అనుసరించాల్సిన విధివిధానాల రూపకల్పన ప్రత్యేక కమిటీలో రైల్వే కోడూరు నియోజకవర్గ జనసేన సీనియర్ నాయకులు యనమల భాస్కర్ కు స్థానం కల్పించడం పట్ల చిట్వేలి జనసేన నాయకులు ఆనాల సునీల్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయం నుండి వెలువడిన అధికారిక ప్రకటనపై ఆనాల స్పందించారు. యనమల పార్టీకి అందించిన సేవలను గుర్తించి సముచిత స్థానం కల్పించడం సంతోషకర విషయం అన్నారు. స్థానిక ఎన్నికలలో జనసేన పార్టీని బలోపేతం చేసే దిశగా పార్టీ నియమాలకు కట్టుబడి అన్ని వర్గాలను కలుపుకొని, పార్టీ కోసం పనిచేస్తామని అనాల సునీల్ కుమార్ తెలియపరిచారు.

## నిందితుడికి జ్యుడిషియల్ రిమాండ్.



**చిట్వేలి, ఆగస్టు 21, ప్రభాతవార్త:**
చిన్నపిల్లలకు చాక్లెట్లు ఆశగా చూపి అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తి పై కేసు నమోదు చేయగా, కోర్టు 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించినట్లు శుక్రవారం స్థానిక ఎస్సై వినోద్ కుమార్ తెలిపారు. గట్టుమీద పల్లి గ్రామానికి చెందిన పలువురు చిన్నా రులపై అనుచితంగా ప్రవర్తించినట్లు నాగిశెట్టి వెంకట సుబ్బయ్య(60) పై కేసు ఫిర్యాదు చేశామన్నారు. రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, రూరల్ సీఐ శ్రీనివాసులు సూచనలతో ఈ కేసు సమగ్ర దర్యాప్తు చేపట్టామన్నారు.దర్యాప్తులో భాగంగా చిన్నారులను విచారించగా, నిందితుడు చాక్లెట్లు ఇస్తానని ఆశ చూపి వారిని తన ఇంటి సమీపానికి పిలిచి, వారితో అనుచితంగా ప్రవర్తించినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయాలపై సంబంధిత సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసి, కేసుకు సంబంధించిన ఇతర ఆధారాలతో నిందితుడు నాగిశెట్టి వెంకటసుబ్బయ్యను శుక్రవారం రాజంపేట కోర్టుకు హాజరపరచగా న్యాయస్థానం నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు. చిన్నారుల భద్రతకు పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని ఎలాంటి ఇబ్బంది కలిగిన తమ దృష్టికి తెలపాలని అన్నారు. కేసులో తదుపరి దర్యాప్తు చట్టం ప్రకారం కొనసాగుతుందని ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు.

## వైభవంగా వరలక్ష్మి పూజలు.

**చిట్వేలి, ఆగస్టు 21, ప్రభాతవార్త:**



శ్రావణ మాసంలో అత్యంత పవిత్రమైన పర్వదినంగా భావించే వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం మండల వ్యాప్తంగా మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇళ్లను శుభ్రం చేసి, మామిడి తోరణాలు, పుష్పాలతో అలంక రించి, కలశాన్ని ఏర్పాటు చేసి వరలక్ష్మీదేవిని ప్రత్యే కంగా అలంకరించి పూజలు చేశారు.ఉదయం నుంచే మహిళలు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, నైవేద్యా లతో అమ్మవారికి పూజలు నిర్వహించి, అష్టోత్తర శతనామావళి పఠించారు. అనంతరం వరలక్ష్మీ వ్రత కథను చదివి, తోరం ధరించి, ముత్తయిదువులకు తాంబూలాలు అందజేశారు.కుటుంబ సభ్యుల ఆరోగ్యం, సుఖసంతోషాలు, సిరిసంపదలు, ఐశ్వర్యం, సౌభాగ్యం కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. వరలక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే అష్టలక్ష్ముల అనుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసం. శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో అమ్మవారికి అర్చకులు వరలక్ష్మి దానిగా అలంకరించి పూజలను అందించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి రూపాన్ని దర్శించుకున్నారు. ఆలయ పెద్దలు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

## తవణంపల్లెలో భక్తి శ్రద్దలతో వరలక్ష్మీవ్రతం



తవణంపల్లె, ఆగస్టు 21 శ్రావణ శుక్రవారం వరలక్ష్మీవ్రతం పండుగ పర్వదినాన్ని మండలంలోని మహిళలు శుక్రవారం సంప్రదాయబద్ధంగా అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. శ్రావణమాసంలో శుక్రవారం వచ్చే వరలక్ష్మీవ్రతంను మండలంలోని మహిళలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ముత్తైదువలు ఆయా గ్రామాలలోని అమ్మవారి ఆలయాలు, ఇళ్ళలో ఈవ్రతాన్ని ఆచరించారు. ఈసందర్భంగా ఆలయంలలో అమ్మవారి ప్రతిమను పసుపుతో తయారుచేసి, పిండి వంటలను నైవేద్యంగా సమరి ్పంచి తాము నిత్య సుమంగళిగా, సౌభాగ్యంగా వుండాలని కోరుతూ మంత్రోఛ్ఛరణల నడుమ భక్తి శ్రద్దలతో వ్రతాన్ని ఆచరించారు. అనంతరం ముత్తైదువులకు పసుపు, కుంకుమలను అందజేసి రక్షాబంధనం ధరించారు. వ్రతం నిర్వహించే మహిళలతో మండలంలోని అమ్మవారి ఆలయాలు కళకళలాడాయి.

**అర్ధ గిరిలో...**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం శ్రావణ వరలక్ష్మీవ్రతంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో అర్చకులు సంపత్‌స్వామి, నిరంజన్ శర్మలు స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో అమ్మవారి ప్రతిమను ప్రతిష్టించి శాస్త్రోక్తంగా వ్రతాన్ని అచరించి భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ రఘుపతి, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో నందమూరి కుటుంబసభ్యులు



**కాణిపాకం, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
నందమూరి కుటుంబసభ్యులు శుక్రవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఈమేరకు దివంగత ఎన్టీఆర్ తనయుడు మోహన్‌కృష్ణ, మోహనరూపా, కామినేని సీమా, సినీ నిర్మాత ప్రసన్నకుమార్‌లు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరెండెంట్ వాసు,అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలో కూడా ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ వేద మండపంలో ఆశీర్వచననం చేసి స్వామివారి శేషవస్త్రాలను, తీర్థ, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

**- ముళ్ల పొదలు తొలగించాలని విజ్ఞప్తి**



**పాకాల, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
పాకాల మండలం దామలచెరువు నుండి పాకాల వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయి రహదారిని కమ్మేస్తున్నాయి. దీనివల్ల ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. రోడ్డు ఇరువైపులా పొదలు విస్తరించడంతో రహదారి చాలా ఇరుకుగా మారింది. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు పక్కకు తప్పుకోవడానికి కూడా స్థలం లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో, మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ద్విచక్ర వాహనదారులు, లారీలు, బస్సు డ్రైవర్లు భయాందోళనలకు గురవుతున్నారు. ముళ్ల కొమ్మలు వాహనాలకు తగిలి రాపిడికి గురికావడమే కాకుండా, ప్రయాణికులపై పడి గాయాలవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను, పిచ్చి పొదలను తొలగించి, రోడ్డుకు మెయింటెనెన్స్ (మరమ్మతులు) చేపట్టాలని స్థానిక ప్రజలు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ధీర్ఘ సుమంగళీ భవ...

**భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం పూజలు**

**చంద్రగిరి, ఆగస్టు 21 ప్రభాతవార్త:**



ధీర్ఘ సుమంగళీ భవ అంటూ దీవించిన వేదపండితుల ఆశీస్సులతో మహిళలు తరించి పోయారు. చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో శ్రావణ శుక్రవారంను పురస్కరించుకుని మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణ మాసంలో రెండవ శుక్రవారం రోజున వరలక్ష్మి వ్రతం జరుపుకుంటారు. సిరులు అందించే అష్ట లక్ష్మీదేవిలలో కోరిన వరాలిచ్చే శ్రీ వరలక్ష్మీదేవికి ప్రత్యేకంగా శ్రావణ శుక్రవారం రోజున విశేష పూజలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తున్నది. మహిళలు తమ మాగళ్య బలం కోసం దీర్ఘ సుమంగళిగా వుండటానికి వ్రతం చేస్తారు. అదేవిధంగా కుటుంబ జీవితంలో సుఖ సంతోషాలు, ఐశ్వర్యం వరలక్ష్మి వ్రతం చేయడం ద్వారా లభిస్తాయని విశ్వసిస్తారు. ఈ వ్రతాన్ని ప్రారంభించే ముందు గణపతి పూజ నిర్వహించి తదుపరి వరలక్ష్మి వ్రతం పూజ చేయడం సంప్రదాయంగా వస్తున్నది.

# తిరుపతి డివిజన్

## సిఎం రిలీఫ్ ఫండ్ అందించిన ఎమ్మెల్యే



**పుత్తూరు, ఆగస్టు 21 ప్రభాతవార్త :**
నియోజకవర్గంలోని పలువురు లబ్దిదారులకు శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ చెక్కులు అందించారు. పుత్తూరు మునిసిపాలిటీకి చెందిన వి.మునిరత్నంనాయుడుకు రూ. 74,441 వేలు, విజయపురం మండలం పాతార్కాడుకు చెందిన ఎం.సుశీలకు రూ. 29,144 వేలు వడమాలపేట మండలంలోని వడమాలకు చెందిన కె.గౌతమికి రూ. 50,000 వేలు, టి.సి.అగ్రహారంలోని కె.బాలాజీకి రూ. 64,650 వేలు, వేమాపురానికి చెందిన కృష్ణారెడ్డికి రూ. 51,098 వేలు, కాయం గ్రామానికి చెందిన జయమ్మకు రూ. 90,158 వేలు, ఎ.నాగభూషణమ్మకు రూ. 50,950 వేలు అందించారు. మొత్తం ఏడుగురుకు రూ. 4,10,441 లక్షలను అందించారు.

## నాలుగు రోజుల పాటు స్పెషల్ క్యాంపైన్ డే నిర్వహణ

**-నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి ఎం.జయకృష్ణ**



**తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్)లో భాగంగా తిరుపతి నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నాలుగు రోజులు పాటు స్పెషల్ క్యాంపైన్ డే నిర్వహించనున్నామని 167నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి ఎం.జయకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి సూచనల మేరకు ఈనెల 22,23, 29,30 వ తేదీల్లో 167 తిరుపతి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ స్పెషల్ కాంపెయిన్ డే నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం నందు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా క్లైములు మరియు అభ్యంతరాల్ని స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులు మరియు సూపర్వైజర్స్ ఖచ్చితంగా పాల్గొనాలని, లేని యెడల శాఖపరమైన చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి ఎం.జయకృష్ణ ఆ ప్రకటనలో హెచ్చరించారు. ఓటర్లు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం



**పాకాల, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
పట్టణంలోని భారత్ మిట్ట మూడవ వీధిలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. డ్రైనేజీ కాలువ పక్కన, సిమెంట్ రోడ్డు మధ్యలోనే చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, పాత బట్టలు కుప్పలుగా పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వీధిలో పేరుకుపోయిన చెత్త వల్ల తీవ్ర దుర్వాసన వస్తుండటంతో పాటు దోమలు, ఈగలు ముసిరి డెంగ్యూ, మలేరియా వంటి తీవ్రమైన వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు మధ్యలోనే వ్యర్థాలు పడి ఉండటంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ చెత్త వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని నివాసితులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందనా లేదని, చెత్తను తొలగించేందుకు కనీస చర్యలు కూడా చేపట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుపై ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. వీధిలో క్రమం తప్పకుండా చెత్తను సేకరించేలా పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలు పాటించకుండా రోడ్డుపై వ్యర్థాలు వేసే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు పేర్కొన్నారు. పంచాయతీ అధికారులు ఇప్పటికైనా స్పందించి పారిశుధ్య పనులను చేపట్టకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

## ఇందిరా కాలనీలో తారు రోడ్డెక్కిన మురుగు

**- పారిశుధ్యం గాలికి వదిలేసిన పంచాయతీ అధికారులు**
**- దుర్వాసనతో ప్రజల అవస్థలు**



**వరదయ్యపాలెం, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
వరదయ్యపాలెం మండలంలోని గిరిజన గ్రామమైన ఇందిరాకాలనీలో పారిశుధ్య పరిస్థితులు రోజురోజుకూ అధ్వానంగా మారుతున్నాయి. మురుగు కాలువల్లో పారాల్సిన మురుగు నీరు ఏకంగా తారురోడ్డుపైకి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. రోజుల తరబడి మురుగు రోడ్డుపైనే నిలిచిపోయినా సంబంధిత పంచాయతీ అధికారులు, స్పెషల్ ఆఫీసర్ అయిన ఎంపీడీఓ విజయమ్మ పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు నిలిచిపోవడంతో పరిసర ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. రాకపోకలు సాగించే ప్రజలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు రోడ్డుపై ప్రవహించడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పారిశుధ్య సమస్యల కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు లేని గ్రామంగా ము!!ఇందిరాకాలనీ గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన సిబ్బంది లేకపోవడం పరిస్థితిని మరింత దారుణంగా మార్చిందని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలో చెత్త తొలగింపు, కాలువల శుభ్రత, మురుగు నీటి సమస్యలను పరిష్కరించేందుకు శాశ్వత చర్యలు కనిపించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే గ్రామం పారిశుధ్య సమస్యలకు నిలయంగా మారుతోందని మండిపడుతున్నారు. ప్రజల నుంచి పన్నులు, ఇతర రూపాల్లో వసూళ్లు చేస్తున్న అధికారులు కనీస పారిశుధ్య సదుపాయాలు కల్పించడంలో ఎందుకు విఫలమవుతున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న సమస్యను కూడా రోజుల తరబడి పట్టించుకోకపోవడం అధికారుల పనితీరుపై అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇకనైనా స్పందిస్తారా? మురుగు నీటిని వెంటనే తొలగించి, కాలువలను శుభ్రం చేయడంతో పాటు ఇందిరా కాలనీలో శాశ్వత పారిశుధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామానికి అవసరమైన పారిశుధ్య కార్మికులను నియమించి, ప్రతిరోజూ పారిశుధ్య నిర్వహణ జరిగేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. ఇకనైనా పంచాయతీ అధికారులు, స్పెషల్ ఆఫీసర్ స్పందించి సమస్యను పరిష్కరిస్తారా? లేక ప్రజల అవస్థలు ఇలాగే కొనసాగుతాయా? అని ఇందిరాకాలనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే గ్రామాన్ని సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలించి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

# బాలికల వసతి గృహం...వార్డెన్‌పై వేటు

**తొట్టంబేడు,ఆగస్టు 21 ప్రభాతవార్త:**
చుట్టుపక్కల గ్రామాల నుంచి తల్లిదండ్రులు తమ బిడ్డలను వసతి గృహాలపై నమ్మకంతో చేర్చుతున్నారు.అయితే ఇక్కడ బాలికలకు భద్రత ఎంత? అనేది ప్రశ్నార్థకంగా మారింది. డిగ్రీకళాశాల సమీపంలోని బాలికల వసతి గృహంలో ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలో ఓ విద్యార్థి బిడ్డను కనడం, ఆ బిడ్డను నిర్థాక్షిణ్యంగా ఓ మూల పడేటం పోలీసులకు ఫిర్యాదు చేయటం యాదృచికంగా జరిగిపోయింది. పైగా ఈ అభంశుభం తెలియని మగబిడ్డను పోలీసులు హాస్టల్‌కు తీసుకొని వచ్చి విచారింగా తమకేమి తెలియదని బుకాయించటం పోలీసులను తప్పుదారి పట్టించారు. చివరకు విచారణలో ఆ బాలునికి జన్మనిచ్చింది హాస్టల్ విద్యార్థియే అని నిర్ధారించారు. దాంతో జిల్లా కలెక్టర్ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయటంతో హాస్టల్‌లో ఏం జరుగుతుంది? విద్యార్థి 9 నెలలు గర్భంతో ఉంటే దాచిపెట్టడం వెనుక ఆంతర్యమేమిటి? విద్యార్థి గర్భం ధరించటమేమిటి? అయితే ఈ హాస్టల్‌లో పలు మార్లు రాజకీయ నాయకులు కూడా సందర్శించారు. అప్పుడు కూడ బయట పడలేదా? ఏం జరుగుతుంది?

### హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్:

పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతిగృహంలో జరిగిన ఘటన నాలుగు రోజుల తర్వాత వెలుగు చూసింది. వసతిగృహ సమీపంలో దొరికిన పురిటి బిడ్డకు తల్లి అదే హాస్టల్ విద్యార్థిని అని పోలీసుల విచారణలో తేలడంతో వార్డెన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. కొద్ది రోజుల ముందు శ్రీకాళహస్తి పురుషుల డిగ్రీ కళాశాల క్రీడా మైదానం ప్రక్కన ఉన్న ఎస్సీ బాలికల వసతిగృహ మరుగుదొడ్ల వద్ద నవజాత మగ శిశువు ఏడుపులు వినిపించాయి. స్థానికులు గమనించి హాస్టల్ సిబ్బందికి తెలియజేయడంతో వార్డెన్ జయసుధ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ నాగరాజు బిడ్డను ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.మొదట్లో హాస్టల్‌కు కాంపౌండ్ లేని వైపు నుంచి ఎవరో బిడ్డను తెచ్చి వదిలి వెళ్లి ఉంటారని వార్డెన్ వివరణ ఇచ్చారు. కానీ హాస్టల్ లోపలే ఘటన జరిగి ఉండవచ్చనే అనుమానంతో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. విద్యార్థినుల నుంచి వచ్చిన సమాచారం, పీడీఎస్యూ ప్రతినిధుల ఆరోపణలతో ఈ కేసు కొత్త మలుపు తిరిగింది. సీఐ నాగరాజు మంచినీళ్లగుంట, ఎన్టీఆర్ నగర్, తెలుగుగంగ కాలనీల్లో ఆరా తీయడంతో పాటు ఈ నెల 15 నుంచి 17 వరకు శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో జరిగిన డెలివరీల రికార్డులు పరిశీలించారు. ఈ క్రమంలో హాస్టల్ విద్యార్థినే ప్రసవించినట్లు తేలింది. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యం వహించిన వార్డెన్ జయసుధ, ఏఎస్‌డబ్ల్యూ ఉదయశ్రీలను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అధికారుల జోక్యంతో బిడ్డ కథకు సుఖాంతం లభించింది. చంటి బిడ్డ తల్లిదండ్రులతో చర్చించి శిశువును తల్లి సంరక్షణలో ఉంచారు. తల్లి ఆరోగ్యం, వైద్య ఖర్చుల కోసం కలెక్టర్ ప్రత్యేక సహాయం అందించారని అధికారులు తెలిపారు. దీంతో "అనాథ"గామిగిలిపోతుందేమోనన్న ఆందోళనకు తెరపడింది.ఈ ఘటనతో ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థినుల భద్రత, పర్యవేక్షణపై మరోసారి చర్చ మొదలైంది.

## అల్లరి చేస్తే కఠిన చర్యలు

-ధర్మరాజుల తిరుణాళ్ళ బందోబస్తు పోలీసులకు ఎస్‌డీపీవో దిశా నిర్దేశం

**పుత్తూరురూరల్, ఆగస్టు 21 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలో జరుగుతున్న శ్రీ ధర్మరాజుల స్వామి తిరుణాళ్ళ సందర్భంగా చేపట్టిన పోలీసు బందోబస్తు ఏర్పాట్లపై శుక్రవారంపుత్తూరు ఎస్‌డీపీవో పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. తిరుణాళ్ళకు భారీగా భక్తులు తరలివచ్చే నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ నిర్వహణపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌డీపీవో మాట్లాడుతూ తిరుణాళ్ళలో కొందరు యువకులు పరుగులు తీయడం, ఒకరినొకరు తోసుకోవడం, మహిళలతో అసభ్యంగా ఈలలు వేయడం, పెద్దగా అరవడం, బూరలు ఊదడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భక్తుల మనోభావాలను భంగం కలిగించే విధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు, యువత పోలీసులకు సహకరించి తిరుణాళ్ళను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయాలని కోరారు. పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చైన్స్ స్నాచింగ్లకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులు అరెస్టు

-67 గ్రాముల బంగారం, కేటీఎం డ్యూక్ బైక్ స్వాధీనం
-రూ.10.21 లక్షల విలువైన సొత్తు రికవరీ



**రేణిగుంట, ఆగస్టు 21 ప్రభాతవార్త:** చైన్ స్నా చింగ్ లకు పాల్ప డుతూ పోలీసులకుసవాల్‌గా మా రిన ఇద్దరు నిందితులను ఏర్పేడు పోలీసులు చాక చక్యంగా పట్టుకుని భారీ గా సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుంచి 67 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు నేరాలకు ఉపయోగించిన కేటీఎం డ్యూక్ 250 మోటార్‌సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రికవరీ చేసిన మొత్తం సొత్తు విలువ సుమారు రూ.10.21 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రేణిగుంటలోని ఓ ప్రైవేటు హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోలీసులు వెల్లడించారు. ఏర్పేడు మండలం కోబాక ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించడంతో గొలుసు దొంగతనాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అరెస్టయిన వారిలో ఏర్పేడు మండలం మోదుగులపాలెం పంచాయతీ కుమ్మరమిట్ట గ్రామానికి చెందిన యానాది విక్టర్ విజయ్‌రాజ్ (22), యానాది డేవిడ్‌కుమార్ (19) ఉన్నారు. వీరి వద్ద నుంచి రూ.8.71 లక్షల విలువైన 67 గ్రాముల బంగారు ఆభరణాలు, సుమారు రూ.1.50 లక్షల విలువైన కేటీఎం డ్యూక్ 250 బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.మద్యం, జల్సాల కోసం దొంగతనాలు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో నిందితుల నేరప్రవృత్తి బయటపడింది. మద్యపానం, జల్సాలకు అలవాటు పడిన వీరు వాటికి అవసరమైన డబ్బు కోసం మహిళలను ముఖ్యంగా వయస్సు మళ్ళిన మహిళలను లక్ష్యంగా చేసుకుని గొలుసు దొంగతనాలకు పాల్పడినట్లు తేలింది. ద్విచక్రవాహనంపై సంచరిస్తూ మహిళల మెడల్లోని బంగారు గొలుసులను అపహరించేవారని పోలీసులు తెలిపారు. మొదటి నిందితుడు తిరుపతిలోని ఆటోనగర్ రంగనాథ్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ నందు ఎలక్ట్రీషియన్ కోర్సు చదివినట్లు విచారణలో వెల్లడైంది. వరుస దొంగతనాల కేసులను ఛేదించేందుకు జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఏఎస్పీ కె. శ్రీనివాసులు పర్యవేక్షణలో, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు పక్కా సమాచారాన్ని సమన్వయం చేసుకుంటూ పోలీసులు సాగించిన దర్యాప్తు చివరకు నిందితులను పట్టుకునేలా చేసింది.ఈ ఆపరేషన్‌లో ఏర్పేడు సీఐ బి. శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సైలు ఎన్. శ్రీకాంత్‌రెడ్డి, టి. ఇమామ్ హుస్సేన్, ఏఎస్ఐ ధర్మసింగ్, పీసీలు అరుణ్, మునేంద్రబాబు తదితరులు కీలకంగా వ్యవహరించారు. నిందితులను వేగంగా గుర్తించి అరెస్టు చేయడంతో పాటు భారీగా సొత్తును రికవరీ చేసిన ప్రత్యేక పోలీసు బృందాన్ని ఉన్నతాధి కారులు అభినందించారు. ప్రజల భద్రతకు ముప్పుగా పరిణమించే గొలుసు దొంగతనాలను అరికట్టడంలో ఏర్పేడు పోలీసులు కనబరిచిన అప్రమత్తత, సమన్వయం, దర్యాప్తు సామర్థ్యం అభినందనీయమని స్థానికులు ప్రశంసిస్తు న్నారు. విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు, రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు, రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర ,ఏర్పేడు సీఐ శ్రీకాంత్,ఏర్పేడుఎస్సై లుశ్రీకాంత్,ఇమామ్ హుస్సేన్, ఏర్పేడు ఏఎస్సై ధర్మ సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జూమ్ సమావేశం

**తిరుపతి క్రీడ, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
అమరావతి ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్రస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు సంబంధించి జిల్లా కలెక్టర్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ ఆధ్వర్యంలో సంబంధిత జిల్లా అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ, మున్సిపల్ కమిషనర్, డిఎంహెచ్ఓ, డిఈఓ తదితర వివిధ లైన్ డిపార్ట్‌మెంట్‌ల అధికారులు పాల్గొన్నారు. అమరావతి ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, అధికారులకు తమ తమ శాఖల పరిధిలో అవసరమైన అన్ని సౌకర్యాలను సమన్వయంతో కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వైద్య సదుపాయాలు, అంబులెన్స్‌లు, బందోబస్తు, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, రవాణా, వసతి తదితర అవసరమైన సౌకర్యాలను స్టేడియం మరియు వసతి కేంద్రాల వద్ద సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని సూచించారు. క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ తరఫున పరిపాలనాధికారి, క్రీడా అధికారులు మరియు జిల్లా క్రీడా అధికారులు ఈ సమావేశంలో పాల్గొని, అమరావతి ఛాంపియన్‌షిప్ నిర్వహణకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలు, వసతి, వైద్య మరియు ఇతర సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. అమరావతి ఛాంపియన్‌షిప్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## ఇంటింటా దేశం ప్రచారం

**తొట్టంబేడు, ఆగస్టు 21 ప్రభాతవార్త:**



ప్రజా సమస్యలను నేరుగా తెలుసు కునేందుకు తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఇంటింటా సుధీరన్న కార్యక్రమం తొట్టంబేడు మండలంలోని విరుపాక్షపురం ఎస్టీ కాలనీలో శుక్రవారం సందడి చేసింది. మండల అధ్యక్షుడు రావిళ్ల మునిరాజనాయుడు, పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి గిరిజన కుటుంబాల కష్టాలను విన్నారు.గత ఐదేళ్లుగా అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం కాని సమస్యలను కాలనీ వాసులు ఈ సందర్భంగా ఏకరువు పెట్టారు. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయాలపై వారు ఆవేదన వ్యక్తం చేశారు.కాలనీలోని పలువురు మహిళలు, వృద్ధులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇంటి పట్టాలు ఇస్తామని చెప్పి మా స్థలాలను కొలిచి తీసుకున్నారు. కానీ ఇప్పటివరకు ఒక్క పట్టా కూడా ఇవ్వలేదు. ఇప్పుడు ఇళ్లు కట్టుకోవడానికి కూడా స్థలం లేకుండా చేశారు, అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలతో చెలగాటం విద్యుత్ లైన్ల ప్రమాదం ఎస్టీ కాలనీపై నుంచే హైటెన్షన్ విద్యుత్ లైన్లు వెళ్తున్నాయని, చిన్నపిల్లలు ఆడుకునే ప్రాంతంలో కూడా వైర్లు వేలాడుతున్నాయని స్థానికులు భయం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబంలో ఇద్దరు పిల్లలు చదువుతున్నా, ఒకరికి మాత్రమే డబ్బులు జమ అయ్యాయని, మరొకరి పేరు జాబితా నుంచి తొలగించారని తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ సావధానంగా విన్న మండలాధ్యక్షుడు మునిరాజు నాయుడు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికే అంకితమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పార్టీ నాయకులు మాజీ మండల అధ్యక్షులు గాలి మురళి నాయుడు,కొన్నలి రమేష్, బీమాల భాస్కర్, చిల్లకూరు మణి, బీజేపీ నాయకులు కృష్ణయ్య, కమల్, సాలి రాజా, గున్నయ్యతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాపానాయుడుపేట బ్రహ్మోత్సవాల్లో రిషితా రెడ్డి



**ఏర్పేడు, ఆగస్టు 21 ప్రభాతవార్త :**
ఆధ్యాత్మికతకు, గ్రామీణ సంప్రదాయాలకు నిలయమైన పాపానాయుడుపేట గ్రామం శుక్రవారం భక్తి శోభతో వెలిగిపోయింది. గ్రామంలో వైభవంగా జరుగుతున్న శ్రీ ధర్మరాజుల స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ ఉత్సవాలకు బొజ్జల రిషితా రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆమెకు స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి, పూలతో ఆహ్వానించారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం చుట్టుపక్కల భక్తులతో నిండిపోయింది. స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

## తొట్టంబేడులో ఇంటింటా తెలుగుదేశం



**తొట్టంబేడు, ఆగస్టు 21 ప్రభాతవార్త :**
తొట్టంబేడు మండలం తొట్టంబేడు గ్రామంలో డోర్ టు డోర్ తెలుగుదేశం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తంగేళ్లపాలెం సహకార బ్యాంక్ చైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, తెలుగుదేశం పార్టీ తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకువివరించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, చందు, సుబ్రహ్మణ్యం, వెంకటయ్య, రంగయ్య, సుబ్బయ్య, కార్యకర్తలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చిమ్మ చీకట్లో కలియుగదైవం ఆలయ దారి



**శ్రీకాళహస్తి రూరల్, ఆగస్టు 21 ప్రభాతవార్త :**
ప్రపంచంలోని కుబేరుల్లో అత్యంత ధనవంతుడు కలియుగ వెంకటేశ్వరస్వామి, తొండమాన్ పురంలో వెలసిన శ్రీదేవి,భూదేవిసమేత వెంకటేశ్వరస్వామి ఆలయానికి నిత్యం పగలు వేలాది మంది భక్తులు వస్తుంటారు. అయితే పొద్దుగుంకితే చిమ్మచీకటి. ఆలయం ఎక్కడుందో తెలియదు. అక్కడకు వెళ్ళాలంటే భయం. కారణం వీధీ దీపాలు వెలగవు, కాలుపెట్టాలంటే కనబడని దారితో తిప్పలు పడుతున్నారు. ఇక ప్రధాన రోడ్డు నుంచి ఆలయానికిమలుపు తిరిగితే ఎగుడు దిగుడు రోడ్లతో జనం తిప్పలు పడుతున్నారు.ఇక్కడ దేవస్థానం అతిథి గృహం ఉంది, ఎదురుగా కళ్యాణ మండపం ఉంది, కానీ వీధి దీపాలు వెలగకుంటే పంచాయతీ పట్టించుకోదు. టిటిడికి ఈ సమస్య తెలుసు లేదో తెలియదు. కానీ చిమ్మచీకటిలో సామాన్యుల తిప్పలు వర్ణనాతీతంగామారింది.

**కళ్యాణాల సీజన్ ...**

పెళ్లిళ్ల సీజన్ వచ్చింది, శుభకార్యాలతో కళకళలాడాల్సిన టీటీడీ కళ్యాణ మండపానికి వెళ్లే దారి మాత్రం చీకటితో నిండి భయాందోళన కలిగిస్తోంది. శ్రీకాళహస్తి మండలం తొండమనాడు గ్రామంలోని టీటీడీ కళ్యాణ మండపానికి వెళ్లే ప్రధాన రహదారిపై వీధిలైట్లు పనిచేయకపోవడంతో వధూవరుల కుటుంబాలు, అతిథులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ నెల నుంచి పెళ్లిళ్ల సీజన్ మొదలైంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా ప్రజలు తక్కువ ఖర్చుతో పెళ్లి చేసుకోవచ్చనే ఉద్దేశంతో టీటీడీ కళ్యాణ మండపాలను ఎంచుకుంటున్నారు. కానీ తొండమనాడు కళ్యాణ మండపానికి వెళ్లే దారి మాత్రం రాత్రి 6 గంటల తర్వాత అంధకారంలో మునిగిపోతోంది.
గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలు, లైట్లు ఏర్పాటు చేసినా అవి మాత్రం గత చాలా రోజులుగా వెలుగడం లేదు. రాత్రి సమయంలో పెళ్లికి వచ్చే వాహనాలు, పాదచారులు చీకట్లోనే నడవాల్సిన పరిస్థితి. పైగా రోడ్డు పక్కన పొదలు, చేలు ఉండటంతో పాములు, ఇతర ప్రమాదాల భయం కూడా వెంటాడుతోంది. టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించిన కళ్యాణ మండపానికి వెళ్లే రహదారి కాబట్టి, రోడ్డు, లైటింగ్ నిర్వహణకు టీటీడీ లేదా పంచాయతీ నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

# తిరుపతి డివిజన్

## జ్ఞానమ్మను దర్శించుకున్న రిషితారెడ్డి

**శ్రీకాళహస్తి,ఆగస్టు 21 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో నిర్వహించిన శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్దలతో చేసుకోవటం ఎంతో సంతోషం కల్గించిందని బొజ్జల రిషితారెడ్డి అన్నారు.ఆలయంలోని అధికారులు పాలకులు ఎంతో చక్కగా ఏర్పాట్లు చేసినట్లు ఆమె అభిప్రాయ పడ్డారు. నియోజకవర్గంలోని మహిళలతో కలసి తాను పూజలు చేసుకోవటం ఎంతో ఆనందం కల్గించిందని వివరించారు. శుక్రవారం దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి చేపట్టిన అలంకారం కన్నులు చాలవన్నట్లు ఉందని అభినందించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయదర్శనం చేసుకున్న ఆమెకు ఆలయమర్యాదలతో స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఏర్పాట్లును ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి పర్యవేక్షించారు.

## ఉపాధి హామీ పనులు కల్పించాలి

**శ్రీకాళహస్తి రూరల్, ఆగస్టు 21 ప్రభాతవార్త:**



ఊరందూరు, జింగిలిపాలెం, నారాయణపురం, పెంకులపాడు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు నిలిపి వేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 24న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ప్రకటించారు. శుక్రవారం ఈ గ్రామాల్లో సామాజిక చైతన్య యాత్ర నిర్వహించిన అనంతరం కెవిపిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడారు. దళిత కాలనీల్లో స్మశాన వాటికలు, తాగునీరు, మురుగు కాలువలు వంటి ప్రాథమిక వసతులు లేవని తెలిపారు. ఊరందూరు, నారాయణపురం, టి.ఎం.వి కండ్రిగ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో మున్సిపాలిటీ విలీనంపై వివాదం ఉన్నా, ఉపాధి హామీ పనులను అధికారులు నిలిపివేయడం సరికాదన్నారు. దీంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆర్డిఓ, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ఉపాధి హామీ పనులు పునఃప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్‌నాయకులు గంధమణి,పెనగడంగురవయ్య, గురునాథం, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ప్రశాంతంగా ఉండాలి

**ఏర్పేడు, ఆగస్టు 21 ప్రభాతవార్త:**



కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరు ప్రశాంతంగా జీవితం గడపాలని అందుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని గ్రంధాలయ చైర్మెన్ రెడ్డివారి గురువారెడ్డి అన్నారు. మండలంలో అతి పెద్ద పంచాయతీ బండారుపల్లి అని ఇక్కడ అధిక సంఖ్య ప్రజలు తెలుగుదేశం మద్దతు దారులుగా ఉండటం తమకు ఎంతో ఆనందం కల్గిస్తుందన్నారు. ఉపాధ్యాయుడు నత్తం భక్తిరెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది ఈ కార్యక్రమానికి గురువారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన నూతన గృహస్తులను అభినందించి వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ఆర్. శివశంకర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం యాదవ్, శ్రీకాళహస్తి మండల పార్టీ నాయకులు మహేష్ రెడ్డి తదితరులు పాల్గొని నత్తం భక్తిరెడ్డి కుటుంబానికి శుభాకాంక్షలు అందజేశారు.

## ఫోక్సో కేసు నమోదు చేయాలని డిమాండ్

**శ్రీకాళహస్తి, ఆగస్టు 21 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌లో నాలుగు రోజుల క్రితం చంటిబిడ్డ లభ్యమైన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం చేసిన నిరంతర పోరాటం, ఒత్తిడి ఫలితంగా అధికారులు చివరకు చర్యలకు దిగారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్టల్ వార్డెన్, ఏ ఎస్ డబ్ల్యూ లను సస్పెండ్ చేయడాన్ని పిడిఎస్యు హర్షిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. జాకీర్, హెచ్. లోకేష్ శుక్రవారం వివరాలు తెలిపారు. హాస్టల్ మరుగుదొడ్ల వద్ద నవజాత శిశువు కనిపించినప్పటి నుంచే ఈ వ్యవహారంలో అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయని, వాస్తవాలు వెలుగులోకి రావడానికి పిడి ఎస్‌యు ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో ఆందోళనలు, డిమాండ్లు చేశామని వారు గుర్తు చేశారు. విచారణలో హాస్టల్ విద్యార్థినే బిడ్డకు తల్లి అని తేలడంతో, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వసతిగృహ వార్డెన్ జయసుధ, ఏ ఎస్ డబ్ల్యూ ఉదయశ్రీలను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ ప్రకటించిన సహాయం సరిపోదని, బాలిక కుటుంబానికి కనీసం రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని పిడిఎసు డిమాండ్ చేసింది. హాస్టళ్లలో సీసీ కెమెరాలు,24 గంటల పర్యవేక్షణ, వార్డెన్ల జవాబుదారీతనం వంటి వ్యవస్థలను పటిష్టపరచాలని కోరింది.

## ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్ట్.

- ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసిన చంద్రగిరి పోలీసులు
- సుమారు రూ.20 లక్షల విలువచేసే 18 ద్విచక్ర వాహనాలు, 1 ఆటో స్వాధీనం - అభినందించిన తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు






**తిరుపతి క్రైం, ఆగస్టు 21, ప్రభాతవార్త**
చంద్రగిరి పోలీసులు ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడిన అంతర్ జిల్లా దుండగులను శుక్రవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు డిపిఓ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో అరెస్టు వివరాలను వెల్లడించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ప్రకటన మేరకు చంద్రగిరి పోలీసులు గత మూడు నెలలుగా ద్విచక్ర వాహనాల దొంగతనాలు పాల్పడే ముఠాలపై ప్రత్యేక సమర్థవంతమైన దర్యాప్తును చేపట్టారు. ఇందులో చంద్రగిరి పోలీసులు పురోగతి సాధించారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుండి 20 లక్షలు విలువ చేసే 18 ద్విచక్ర వాహనాలు ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ నిందితులను నారావారిపల్లి, భీమవరం రోడ్డులోని శేషాపురం శివాలయం సమీపంలో అరెస్ట్ చేశారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు అదే రోజు మధ్యాహ్నం 1 శ్రీనివాసమంగాపురం గ్రామ సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో దాచిపెట్టిన ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా చంద్రగిరిలో 7 కేసులు, ఎస్వీయూ క్యాంపస్ 3 కేసులు, తిరుపతి రూరల్ 2 కేసులు, తిరుచానూరు 1 కేసు, శ్రీకాళహస్తి వన్ టౌన్ 2 కేసులు, నెల్లూరు రూరల్ 2 కేసులు, వేదాయపాళెం 1 కేసు, మనుబోలు 1 కేసు, తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీకి గురైన మొత్తం 18 ద్విచక్ర వాహనాలు, 1 ఆటో స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పఠాన్ అఫ్రోజ్, లోచన్ నివాస్, కృష్ణప్ప ఆచారి సాయికృష్ణ, ఎం వంశీకృష్ణ, ఎన్ జితేంద్ర బెనర్జీ, పి సతీష్ బాబులపై సంబంధిత కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించనున్నారు.

**- చంద్రగిరి పోలీసులకు అభినందనలు**

సాంకేతిక నైపుణ్యంతో చాకచక్యంగా ద్విచక్ర వాహనాల చోరీ నిందితులను అరెస్టు చేసిన డిఎస్పి ప్రసాద్, సిఐ సురేష్ కుమార్, ఎస్సైలు రవి ప్రకాష్ రెడ్డి, అరుణాచలం, వారితో పాటు హెడ్ కానిస్టేబుల్ కానిస్టేబుల్‌లను అభినందించారు. - పాత వాహనాలను కొనుగోలు చేసేటప్పుడు సరిచూసుకోండి : తిరుపతి జిల్లా ఎస్పీ ఎవరైనా పాత వాహనాలను కొనుగోలు చేసేటప్పుడు సంబంధిత డాక్యుమెంట్లను పక్కగా పరిశీలించి తరువాతే వాహనాలను కొనుగోలు చేయాలని తిరుపతి జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనం చేయబడిన వాహనాలు కొనుగోలు చేస్తే ఆ యజమాని కూడా నిందితుడు కాగలడు అని తెలిపారు. తమకు ఏదైనా అనుమానం కలిగితే సంబంధిత పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇస్తే మొదటగా తమ పేర్లను గోప్యంగా ఉంచి పూర్తి పరిశీలన అనంతరం పోలీసులు నిర్ధారించిన తర్వాత కొనుగోలు చేయండి అని ప్రజలకు సూచించారు.

